క్లుప్తంగా

పొందుగలలో వైద్యశిబిరం

దాచేపల్లి : మండలంలోని పొందుగల గ్రామంలో ఉచిత వైద్యశిబిరం శనివారం నిర్వహించారు. నారాయణపురం సీతా హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరాన్ని వైస్ ఎంపీపీ తండా అబ్దుల్‌సత్తార్ ప్రారంభించారు. డాక్టర్లు నాగార్జున, అలేఖ్య, నెల్లూరి బ్రహ్మయ్య ఈ శిబిరంలో పాల్గొని సాధారణ రోగాలతో బాధపడుతున్న వారికి ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. అదే విధంగా అర్థోపెడిక్ సమస్యలతో ఇబ్బంది పడుతున్న వారికి కూడా వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు. ఈ శిబిరంలో ఆవుల సైదులు, ముడి విక్టర్‌పాల్ పాల్గొన్నారు.

మృతిరాలి కుటుంబానికి ఆర్థిక సాయం



మాచర్ల: పట్టణంలోని 10వ వార్డుకు చెందిన బుట్టి నాసరమ్మ అకాల మృతి చెందగా మట్టి ఖర్చుల నిమిత్తం మున్సిపల్ కమిషనర్ ఈవి రమణబాబు, వార్డు కౌన్సిలరు యర్రాకుల సిద్ద య్యలు మట్టి ఖర్చుల నిమిత్తం కుటుంబ సభ్యులకు అందించారు. శనివారం బాధిత కుటుంబ సభ్యులకు రూ. 10వేలు అందజేసి త్వరలో వైఎస్సార్ బీమా నగదును మంజూరవుతుందని కుటుంబాన్ని ఓదార్చారు.

సామరస్య వాతావరణంలో పండుగ జరుపుకోవాలి



మాచర్ల: పట్టణంలో త్వరలో జరిగే బక్రీద్ పండుగను ప్రశాంతంగా, సామరస్యంగా జరుపుకోవాలని అర్బన్ సీఐ టి బాలకృష్ణ అన్నారు. శనివారం పట్టణ పోలీసు స్టేషన్‌లో హిందూ, ముస్లిం మత పెద్దలతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో అన్ని పండుగలను ప్రతి ఒక్కరూ శాంతియుతంగా జరుపుకోవడం ఎంతో ఆనందకరమన్నారు. అదే విధంగా రాబోయే రోజుల్లోనూ పండుగలన్నీ కలిసికట్టుగా ఐక్యత ప్రదర్శించాలన్నారు. ఈ సందర్భంగా మత పెద్ద సూచనలను అడిగి తెలుసుకున్నారు. ఎస్ఐ అరుణ,ముస్లిం, హిందూ మత పెద్దలు పాల్గొన్నారు.

ఉచిత న్యాయ సలహాను సద్వినియోగం చేసుకోవాలి

జూనియర్ సివిల్ జడ్జి షర్మిల

గురజాల : న్యాయవాదిని ఏర్పాటు చేసుకోలేక ఇబ్బందులు పడుతున్న ఖైదీలు ఉచిత న్యాయవాదిని ఏర్పాటు చేయడం జరుగుతుందని జూనియర్ సివిల్ జడ్జి డి షర్మిల తెలిపారు. స్థానిక సబ్ జైల్‌ను శనివారం 10వ అదనపు జిల్లా జడ్జి , మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ జి వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సబ్ జైల్‌లో సమయానికి భోజనం, వైద్య సదుపాయాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఎవరికైనా న్యాయవాదిని ఏర్పాటు చేసుకోవాలంటే సబ్‌జైలర్ గారి ద్వారా అర్జీని న్యాయమూర్తికి చేసుకోవాలన్నారు. అనంతరం వంటగదిని పరిశీలించారు.

జులై నుంచి ట్రాఫిక్ ఆంక్షలు

పిడుగురాళ్ల: జులై 1వ తేదీ నుంచి భారీ వాహనాలపై ట్రాఫిక్ ఆంక్షలు ఉండబోతాయని పిడుగురాళ్ల పట్టణ సీఐ పీవీ ఆంజనేయులు తెలిపారు. పట్టణ పోలీస్ స్టేషన్‌లో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ బైపాస్ నిర్మాణంలో భాగంగా రైల్వే బ్రిడ్జి నిర్మాణ పనులు ఈ నెల చివరి నాటికి పూర్తి అవుతాయని గతంలో నామ్ ఎక్స్‌ప్రెస్ హైవే, రాంఖీ ఇన్‌ఫ్రాస్ట్రెక్చర్ లిమిటెడ్ ప్రతినిధులు తెలిపారు. అయితే ఈ నిర్మాణానికి రైల్వే బ్రిడ్జి సంబంధించి నూతన అనుమతులు ఈ నెల 16వ తేదీన వచ్చాయని ప్రతినిధులు తెలిపారు. ఈ కారణంగానే రైల్వే బ్రిడ్జి నిర్మాణం అలస్యమవుతుందని తెలిపారు. ఆగస్టు చివరి నాటికి రైల్వే బ్రిడ్జి వన్‌వే పూర్తి చేస్తామని నామ్ ఎక్స్‌ప్రెస్ హైవే ప్రతినిధులు తెలిపారు. ఆ తర్వాత సెప్టెంబర్ మాసంలో ట్రైల్‌రన్ పూర్తి చేస్తామని తెలిపారు. అదేవిధంగా అక్టోబర్ చివరి నాటికి రైల్వే బ్రిడ్జి పూర్తిస్థాయిలో నిర్మిస్తామని తెలిపారు. అందుకనే ఇప్పుడు ట్రాఫిక్‌ను గుంటూరు నర్సరావుపేట వైపు నుంచి వచ్చే వాహనాలను పోలీస్ స్టేషన్ సెంటర్ మీదుగా పిల్లుట్ల రోడ్డు బైపాస్ కలిపి ఖలీల్ దాబా నుంచి వాహనాలు వెళ్తున్నాయి, ఖలీల్ దాబా వైపు నుంచి గుంటూరు, నర్సరావుపేట వెళ్లే భారీ వాహనాలు కూడా పిల్లుట్ల రోడ్డు బైపాస్ నుంచి పోలీస్ స్టేషన్ సెంటర్ మీదుగా వెళ్తున్నాయి. ఈ క్రమంలోనే రైల్వే బ్రిడ్జి నిర్మాణం ఆలస్యమవుతుండడంతో భారీ వాహనాలకు జులై మొదటి వారం నుంచి పల్నాడు జిల్లా ఎస్పీ వై. రవిశంకర్‌రెడ్డి ఆదేశానుసారం భారీ వాహనాలకు ట్రాఫిక్ నిబంధనలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ భారీ వాహనాలు పట్టణంలోకి ఏ సమయంలో రాకపోకలు నిర్వహించాలన్న సమాచారాన్ని ఎస్పీ గారి ఆదేశాలతో జులై మొదటి వారంలో తెలుపుతామన్నారు. మే 1వ తేదీ నుంచి ఐలాండ్ సెంటర్ మీదుగా రానివ్వకుండా పోలీస్ స్టేషన్ సెంటర్ మీదుగా పిల్లుట్ల రోడ్డు కలుపుతూ బైపాస్‌కు వాహన రాకపోకలకు ఎటువంటి అంతరాయం కలగకుండా నిర్వహిస్తున్నాం, ఈ ట్రాఫిక్ నిబంధనల కోసం ప్రత్యేకంగా పోలీస్ సిబ్బందితోపాటు హైవే సిబ్బంది కూడా 24 గంటలు అందుబాటులో ఉంటున్నారని తెలిపారు.

ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు

- ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి
- ఇంటింటికీ వెళ్లి పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే కాసు
- 18 సచివాలయాలకు గాను 11 సచివాలయాల్లో పూర్తి



వృద్ధులు, మహిళలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కాసు

గురజాల : వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక ప్రతి కుటుంబానికి కలిగిన లబ్ధిని వివరించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. గురజాల నియోజకవర్గంలో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరిస్తూ ఎంతో ఉత్సాహంగా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటున్నారు. వృద్ధులు, వికలాంగులు, అన్ని వర్గాల వారితో ఆప్యాయంగా పలకరిస్తూ వారికి ఇబ్బందులు ఉంటే స్థానిక వలంటీర్‌లను పిలిచి వృద్ధులకు, వికలాంగులకు సహాయంగా ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. అన్ని వర్గాల వారిని పలకరిస్తూ సమస్యలు అడిగి తెలుసుకుని అర్హతలు ఉండి పథకాలు అందకపోతే అక్కడే సచివాలయ సిబ్బందితో చర్చించి సమస్యకు పరిష్కారం చూపే విధంగా చర్యలు చేపడుతున్నారు.

11 సచివాలయాల్లో గడప గడప పూర్తి ...

మండలంలో మొత్తం 18 గ్రామ వార్డు సచివాలయాలు ఉన్నాయి. వాటిల్లో ఇప్పటివరకు 11 గ్రామ వార్డు సచివాలయాల్లో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. మొత్తం ఇప్పటివరకు సుమారుగా 23 వేల పైచిలు గడపలకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకున్నారు. వాటిలో అక్కడికక్కడే వీధి లైట్లు, మురుగు నీటి పారుదల, నీటి వసతి వంటి చిన్న సమస్యలను పరిష్కరించారు. అదే విధంగా గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా ప్రత్యేకంగా నిధులు సమకూర్చి గ్రామాల్లో అవసరమైన ప్రాంతాల్లో సీసీ రోడ్లు నిర్మాణం చేపట్టారు. జంగమహేశ్వరపురం 1,2 సచివాలయాలు, పులిపాడు 1,2 సచివాలయాలు, చర్లగుడిపాడు 1,2 సచివాలయాలు, పాత అంబాపురం సచివాలయాల్లో గడప గడపకు మన ప్రభుత్వం జరగాల్సివుంది.

కాసుకు ప్రశంసలు...

ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డిపై అధికార , ప్రతిపక్ష పార్టీల నుంచి ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. తెలుగుదేశానికి కంచుకోటలు అయిన మాడుగుల, గురజాల, దైద, తేలుకుట్ల, వంటి గ్రామాల్లో సైతం కాసు మహేష్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని విజయవంతంగా ముగించారు. ప్రతి ఒక్కరి దగ్గరకు వెళ్లి మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకోవడంపై పలువురు ప్రతిపక్ష పార్టీలకు చెందిన నాయకులు కాసును అభినందిస్తున్నారు. గతంలో 9 సంవత్సరాలు అధికారంలో ఉన్న మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు గాని తెలుగుదేశం పార్టీ నాయకులు ఒక్కరూ కూడా ఈ విధంగా గ్రామాల్లో పర్యటించలేదని కాసు మహేష్‌రెడ్డి ప్రతి ఇంటికి వచ్చి పలకరించడం ఎంతో ఆనందంగా ఉందని ప్రతిపక్ష పార్టీ కార్యకర్తలు, నాయకులు, మహిళలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

కళాశాలకు పుస్తకాల వితరణ



విజయపురిసౌత్: స్థానిక ఏపీఆర్ జూనియర్ కళాశాలకు శనివారం పవర్‌మెక్ ఫౌండేషన్, నోబెల్ ఎడ్యుకేషన్ ఎంపవర్‌మెంట్ సొసైటీ ప్రతినిధి శ్రీకాంత్ ఆధ్వర్యంలో రూ. 3 లక్షల విలువైన పుస్తకాలను అందజేశారు. విద్యార్థులకు అవసరమైన కాంపిటేటివ్ ఎగ్జామ్స్, నీట్, ఎంసెట్, సీఏ, సీపీటీ, ఐఐటీ ప్రవేశ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు వీటిలో ఉన్నాయి. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఎస్ సరోజిని, గ్రంథాలయ అధికారి రమణారెడ్డి, అధ్యాపకులు చందూ ఆంజనేయులు, సుబ్బారెడ్డి, చంద్రశేఖర్, పుల్లయ్య, లింగేశ్వరావు, జగదీష్, పూర్వ విద్యార్థులు జి రమేష్‌నాయుడు, అనూప్, కళాశాల సిబ్బంది హనుమంతురావు, వెంకటేష్, అన్వర్‌బాష, రాజీవ్‌రత్న తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో సమస్యలు పరిష్కారం

దాచేపల్లి : జగనన్న సురక్ష ద్వారా ప్రజల సమస్యలు పరిష్కారం అవుతాయని సర్పంచ్ వినుకొండ కోటేశ్వరరావు అన్నారు. మండల వ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. సచివాలయం, వార్డు కన్వీనర్లతో పాటుగా వలంటీర్లు ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం ద్వారా అందిన పథకాల వివరాలు నమోదు చేసుకున్నారు. అర్హత ఉండి ఏ పథకాలు రాలేదో కూడా నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ కోటేశ్వరరావు మాట్లాడుతూ..ప్రభుత్వం ద్వారా ప్రజలకు సంపూర్ణంగా మేలు జరిగేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారని, ఈ కార్యక్రమం ద్వారా సమస్యలను ప్రజలు ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చే అవకాశం ఉందన్నారు. కార్యక్రమాల్లో వినుకొండ వజ్రం, ముశ్యం వెంకటేశ్వర్లు, మందపాటి వెంకటరెడ్డి, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలందించేందుకే జగనన్న సురక్ష

మాచర్ల రూరల్: అర్హత ఉండి ఏ కారణం చేతైనా ప్రభుత్వ పథకాలు అందకపోతే వారికి అందించేందుకు జగనన్న సురక్ష పథకం ముఖ్యమంత్రి ప్రవేశపెట్టారని ఎంపీడీఓ వి కోటేశ్వరరావు తెలిపారు. శనివారం మండలంలోని కంభంపాడు, గన్నవరం గ్రామాల్లో జగనన్న సురక్ష పథకాన్ని ఇంటింటికీ వివరిస్తూ ఆయన మాట్లాడారు. జగనన్న నవరత్నాలు పథకాలు అర్హత ఉండి రాని వారికి ఇంటి వద్దనే సరిఫికెట్లు అందించి పథకం అర్హత కల్పించేందుకు తక్షణమే చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. లబ్ధిదారులందరూ సురక్ష పథకాన్ని సద్వినియోగపర్చుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆరికట్ల చంద్రశేఖర్‌రెడ్డి, కార్యదర్శులు బిట్టు వెంకటేశ్వర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో అర్హులందరికీ మేలు

దుర్గి: దేశ చరిత్రలో ఏ రాష్ట్రంలో లేని విధంగా అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను అందించటానికై రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం చరిత్రాత్మకమని ఎంపీపీ యేచూరి సాయిశంకర్ అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ సమావేశం మందిరంలో సచివాలయ ఉద్యోగులనుద్దేశించి ప్రసంగించారు. ప్రభుత్వ పథకాలు నేరుగా అర్హులైన లబ్ధిదారులకు అందించడంతో పాటు నోరు తెరిచి అడగలేనివారు ఎక్కడైనా ఉంటే వారి ఇంటికి కూడా వెళ్లి తలుపు తట్టి లబ్ధి చేకూర్చటమే ఈ పథకం లక్ష్యమన్నారు. గ్రామ సచివాలయాల్లో దాదాపు 600 లకు పై చిలుకు పౌర సేవలందిస్తున్నారని, కుల, మత రాజకీయ వివక్ష లేకుండా సంక్షేమ పథకాలను అందించడం జగనన్న ప్రభుత్వానికే చెల్లిందన్నారు. ఎంపీడీఓ కె సమతా వాణి మాట్లాడుతూ పథకం అమలుకు షెడ్యూలును ఖరారు చేశామని దాని ప్రకారం ఆయా గ్రామాల్లో అధికారులు పర్యటించి అక్కడి కక్కడే సమస్యలను పరిష్కరిస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డి జీఎల్ఎన్ గుప్త, ఎఓ శివప్రసాద్, పంచాయతీ సెక్రెటరీలు హఫీజుద్దీన్, పి శివశంకర్, వెంకటరెడ్డి, ఆయా గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాలి

మాచవరం: అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని ఎంపీడీఓ



జగనన్న సురక్షలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ తురక కిషోర్, కమిషనర్ రమణబాబు

యు.బి.వరప్రసాద్ అన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమ నిర్వహణలో బాగంగా స్థానిక వడియరాజుల కల్యాణ మండపంలో వలంటీర్లకు, సచివాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులకు రెండవ రోజు శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షెడ్యూల్ ప్రకటించిన వారం రోజుల ముందు డేటా వలంటీర్ల సెల్‌ఫోన్లో పొందుపరుస్తారని, వలంటీర్లు తమ పరిధిలో ఉన్న 50 గృహాలను సందర్శించి, సమస్యలను యాప్‌లో నమోదు చేయాలన్నారు. 11 అంశాలకు సంబంధించిన ధృవీకరణ పత్రాల మంజూరు కోసం దరఖాస్తుల స్వీకరణకు అవసరమయ్యే పత్రాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ దారం లక్ష్మిరెడ్డి, జెడ్పీటీసీ శివాయాదవ్, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ వంకాయల రమేష్, మండల కో-ఆప్షన్ మెంబర్ మహమ్మద్ జానీ, షైదా, ఈఓఆర్‌డీ వెంగళరావు, సర్పంచులు, ఎంపీటీసీలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

మాచర్ల: జగనన్న సురక్ష ద్వారా ప్రతి వార్డులో అర్హత కలిగిన ప్రతి వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించేందుకు వాలంటీర్ ద్వారా ఇంటింటి సర్వే చేసి లబ్ధి పొందాల్సిన వారి జాబితాను సిద్ధం చేయడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని పేద కుటుంబాల వారు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ తురక కిషోర్ కోరారు. జగనన్న సురక్ష పథకంలో భాగంగా 1,2, వార్డుల్లో కిషోర్, కమిషనర్ రమణబాబు, కౌన్సిలర్లు గట్ల అరుణ కోటిరెడ్డి, ఎంఆర్ఎఫ్ రామాంజనేయరెడ్డి, రామిశెట్టి వెంకటేశ్వర్లు, పురపాలక సంఘ కో ఆప్షన్ మెంబర్ అల్లి జీవన్‌లు ఇంటింటికీ తిరిగి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ లబ్ధిదారులకు ఎలా పథకాలు అందుతున్నాయి. రానివారెవరూ అనే అంశం పై ఆరా తీశారు. అనంతరం వివిధ ప్రాంతాల్లో ప్రజలతో మాట్లాడుతూ జగనన్న అందజేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. మున్సిపల్ కమిషనర్ ఆయా వార్డులలోని వలంటీర్లు, ఉద్యోగస్తులకు సర్వే గురించి వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, ఉద్యోగులు, సచివాలయ ఉద్యోగులు, మహిళా పోలీసులు, గృహ సారధులు భారీగా పాల్గొన్నారు.

జగనన్న సురక్ష ద్వారా ప్రజల ఆదరాభిమానాలు మరింతగా పొందాలి

కారెంపూడి: సంక్షేమ పథకాలు అందడంలో ఇంకా ఏమైనా మిగిలి ఉన్న వివిధ రకాల సమస్యలను అలాగే గ్రామ సచివాలయాల ద్వారా అందాల్సిన పౌర సేవలు అందడంలో సమస్యలుంటే వాటిని



సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం పోస్టర్ విడుదల చేస్తున్న ప్రజా ప్రతినిధులు



జగనన్న సురక్ష పథకం పై ఇంటింటికీ పర్యటిస్తున్న ఎంపీడీఓ కోటేశ్వరరావు

గుర్తించాలని ఎంపీపీ మేకల శారదా శ్రీనివాసరెడ్డి పిలుపు నిచ్చారు. ఒకటవ తేదీ నుంచి జగనన్న సురక్ష కార్యక్రమం ప్రారంభ కానున్న నేపథ్యంలో ఎంపీపీ శనివారం వివిధ గ్రామాల్లో పర్యటించారు. గ్రామ వలంటీర్లు ఇంటింటికి తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని నమోదు చేయాలన్నారు. ఒకటో తేదీ లోపు వలంటీర్లు సచివాలయ సిబ్బంది, సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులు ప్రతి ఇంటికి వెళ్లి సమస్యల గుర్తించి వాటిని నమోదు చేయాలని కోరారు. అలాగే వివిధ గ్రామాల సచివాలయాలకు వెళ్లి సమస్యల గుర్తించాల్సిన విధానంపై వారికి దిశానిర్దేశం చేశారు. గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు వార్డు సభ్యులు అందరూ కూడా వారి దృష్టికి వచ్చిన ప్రతి సమస్యను గుర్తించాలని వాటిని పరిష్కరించి స్థానికంగా ప్రజల ఆదరాభిమానాలు పొందాలని ఎంపీపీ సూచించారు. ఇది ఎంతో విబిన్నమైన వినూత్న కార్యక్రమమని ఇలా ప్రతి గడపలో సమస్యలను జల్లెడపట్టి వాటిని పరిష్కరించడం అనేది ఇప్పటి వరకు జరగలేదని అలాంటి ప్రజోపకరమైన సేవా కార్యక్రమంలో అందరూ చిత్తశుద్ధితో పాల్గొనాలని ఎంపీపీ కోరారు. ఈ నేపథ్యంలోనే మరో వైపు ఎంపీడీఓ జి శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ జి శ్రీనివాస్ కూడా గ్రామ పర్యటనలు చేశారు.

సమస్యల పరిష్కార వేదికగా జగనన్న సురక్ష పథకం

పిడుగురాళ్ల: ప్రజా సమస్యలను పరిష్కార వేదికగా జగనన్న సురక్ష పథకం ఉపయోగపడాలని పలువురు వ్యక్తులు అన్నారు. పట్టణంలోని పలువార్డులోని జగనన్న సురక్ష పథకంపై వలంటీర్లుకు, గృహసారధులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన వారికి ఉచితంగా 11 రకాల సేవలను అందిస్తుందని దానిని ప్రజలకు తెలియజేసి అవసరమైన వారికి అందించాలని వారు సూచించారు. కార్యక్రమంలో ఎంఎల్‌వో బ్రహ్మారెడ్డి, కేఎస్ కన్వీనర్ జూలకంటి శ్రీనివాసరావు, కౌన్సిలర్ జోగిపర్తి ముక్కంటేశ్వరరావు, మాదాల కిరణ్‌కుమార్, పసుపులేటి ఆనంద్, కత్తెరపు వాసుదేవరెడ్డి, గొట్టిముక్కల పవన్‌రెడ్డి, వలంటీర్లు, గృహసారధులు తదితరులు పాల్గొన్నారు.

రైల్వేగేట్ వద్ద రోడ్డుకు మరమ్మతులు



రోడ్డుకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

దాచేపల్లి : మండలంలోని కేసానుపల్లి రైల్వేగేట్ వద్ద రోడ్డుకు ఎట్టకేలకు శనివారం మరమ్మతులు చేశారు. ఈ రోడ్డు రైల్వేశాఖ పరిధిలో ఉన్నది. రోడ్డులో గుంతలు ఏర్పడి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుంది. ఈ రోడ్డుకు మరమ్మతులు చేయాలని పలుమార్లు కేసానుపల్లి, తక్కెళ్లపాడు, దాచేపల్లి ప్రజలు స్థానిక రైల్వే అధికారులను కలిసి విన్నవించారు. రైల్వే అధికారులు పట్టించుకోకపోవడం రోడ్డులో పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం కేసానుపల్లిలో పర్యటించిన స్థానిక ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి దృష్టికి రోడ్డు సమస్యను సర్పంచ్ వినుకొండ కోటేశ్వరరావుతో పాటుగా గ్రామస్తులు తీసుకెళ్లారు. రోడ్డుకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని ఆర్అండ్‌బీ అధికారులకు ఎమ్మెల్యే కాసు సూచించారు. దీంతో రోడ్డును జెసీబీ ద్వారా పూర్తిగా కదలించారు. రోడ్డులో ఏర్పడిన గుంతలను గుళ్లతో పూడ్చి దానిపై డస్ట్‌పౌడర్ చల్లారు. ఈ పనులను స్థానికులు కిష్టిపాటి అంకిరెడ్డి, బొడ్డు నాగేశ్వరరావు, నెల్లూరి కోటేశ్వరరావు, ఉల్లేరు హనుమంతరావు పర్యవేక్షించారు. ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి తక్షణమే రోడ్డుకు మరమ్మతులు చేయించడం పట్ల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

సమష్టిగా సకాలంలో సేవలందిద్దాం

తహసీల్దార్ మహమ్మద్ హుస్సేన్



నూతనంగా నియమితులైన తహసీల్దార్ మహమ్మద్ హుస్సేన్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

మాచర్ల రూరల్: ప్రభుత్వం అందించే ప్రతి ఒక్క సంక్షేమ పథకాన్ని, రెవెన్యూ సేవలను నిర్ణీత సమయంలో ప్రజలకు అందించేందుకు అందరం సమష్టిగా పనిచేద్దామని నూతనంగా నియమితులైన తహసీల్దార్ షేక్ మహమ్మద్ హుస్సేన్ కోరారు. శనివారం మండల తహసీల్దార్ కార్యాలయంలో నూతనంగా నియమితులైన సందర్భంగా ఆయనను సన్మానించిన తోటి ఉద్యోగులతో ఆయన మాట్లాడారు. వెనుకబడిన పల్నాటి ప్రాంతంలో విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించకుండా రైతులకు సకాలంలో రెవెన్యూ సేవలందించేందుకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సేవలందిద్దామన్నారు. మహమ్మద్ హుస్సేన్ పెద నందిపాడు డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తూ పదోన్నతి పై ఇక్కడికి వచ్చారు. ఈయనకు డిప్యూటీ తహసీల్దార్లు బత్తుల వాణి, షేక్ బాష, మురళీ, ఆర్ఐ ఫణీంద్ర, జిల్లా వీఆర్‌ఓల సంఘం అధ్యక్షుడు నాగేశ్వరరావు, టైపిస్టు శ్రీవలి, మస్తాన్‌వలి, తదితరులున్నారు.

ఇథియోపియా డెలిగేట్స్ క్షేత్ర సందర్శన



పంటలను పరిశీలిస్తున్న ఇథియోపియా డెలిగేట్స్

పిడుగురాళ్ల: మండలంలోని జూలకల్లు గ్రామంలో పల్నాడు ఉద్యాన రైతు ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్‌ను డాక్టర్ రాజ్ ఆధ్వర్యంలో ఇతియోపియా నుంచి ఐదుగురు బృంద సభ్యులు మినిస్ట్రీ ఆఫ్ అగ్రికల్చర్‌ను వీక్షించారు. మిరప పండించేటువంటి రైతులను కలిసి వారు ఏ విధంగా వ్యవసాయం చేస్తున్నారు అని తెలుసుకోవడం జరిగింది. డిజిటల్ గ్రీన్ సంస్థ, ఆంధ్రప్రదేశ్ ఉద్యాన ఎశాఖ సంయుక్తంగా ఈ మిర్చ ఈనే ప్రాజెక్టు గురించి డెలిగేట్స్ వివరిస్తూ మిరపలో నాణ్యమైన ప్రమాణాలు నిర్ధారించే భౌతిక, రసాయనిక పరీక్షలు రంగు, కారము, తేమశాతం, అప్లోటాక్సిన్ ఎంతో మోతాదులో ఉన్నవో ఆర్టిఫిసియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత యంత్ర పరికరము ద్వారా తెలియజేశారు. ఈ ప్రాజెక్టు యొక్క ముఖ్య ఉద్దేశం మిరప రైతులను సాంకేతికంగా ఆర్థికంగా బలోపేతం చేయటం కోసమని ఉద్యాన వన శాఖాధికారులు తెలియజేశారు. మిరప రైతులతో ముఖాముఖి చర్చలు నిర్వహించారు. ఇతియోపియా డెలిగేట్స్ డాక్టర్ రోజ్, ఉద్యాన కమిషనర్ కార్యాలయం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ వివిఎస్ ధర్మరాజు, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్ జైకా, కె.సాజా నాయక్, డిస్ట్రిక్ట్ హార్టికల్చర్ ఆఫీసర్ బిజె బెన్నీ, ఉద్యాన వన శాఖ అధికారి మోహన్, పి. శ్రీనివాసరావు, వీహెచ్ఏ దస్తగిరి, ప్రకృతి వ్యవసాయ విభాగం నుంచి డిపిఎం అమలకుమారి, సీఆర్పీలు, ఐ ఆర్‌పీలు, డిజిటల్ గ్రీన్ సంస్థ సభ్యులు నరేంద్ర, కమలాకర్, మస్తాన్, కల్లుడి ప్రాజెక్టు మేనేజర్ కిరణ్ గణేష్, పల్నాడు ఉద్యాన ఉత్పత్తదారుల సంస్థ నుంచి చైర్మన్ బెల్లంకొండ సుబ్రహ్మణ్యం, వైఎస్ ఎంపీపీ గార్లపాటి వెంకటేశ్వరరెడిడ, సర్పంచ్ పావులమ్మ, గ్రాద పెద్దలు, బోర్డు ప్రతినిధులు, వెంకటేశ్వర రెడ్డి, రామిరెడ్డి, నక్కల వెంకయ్య, ఎఫ్‌పీసీ రైతులు తదితరులు పాల్గొన్నారు.

గురజాలలో డిగ్రీ కళాశాలకు అనుమతి లేదు

ఏఎన్‌యూ సీడీసీ డీన్ ఆచార్య కె మధుబాబు

ఏఎన్‌యూ: పల్నాడు జిల్లా గురజాలలో సునీతి డిగ్రీ కళాశాలకు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ నుంచి ఏ విధమైన అనుమతులు లేవని యూనివర్సిటీ సీడీసీ డీన్ ఆచార్య కె మధుబాబు తెలిపారు. గురజాలలో సునీతి డిగ్రీ కాలేజ్ పేరుతో డిగ్రీ అడ్మిషన్లు నిర్వహిస్తున్నారని ఎస్సీ, ఎస్టీ స్టూడెంట్స్ అసోసియేషన్ నుంచి యూనివర్సిటీకి ఫిర్యాదు అందిందన్నారు. ఈ కళాశాలకు ఎటువంటి అనుమతులు లేవని తెలిపారు. ప్రస్తుతం డిగ్రీ కోర్సులకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నత విద్యా మండలి ఆధ్వర్యంలో ఆన్‌లైన్ విధానంలో అడ్మిషన్లు జరుగుతున్నాయని, ఆ జాబితాలో కూడా ఈ కళాశాల లేదని తెలిపారు. ఏ విధమైన అనుమతులు లేకుండానే ఈ కళాశాల నిర్వాహకులు నేరుగా విద్యార్థులను డిగ్రీ కోర్సుల్లో చేర్చుకుంటున్నారని తమ దృష్టికి వచ్చిందన్నారు. అనుమతి లేకుండా పొందిన అడ్మిషన్లు, డిగ్రీలు చెల్లవని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఈ విషయం గుర్తించి జాగ్రత్త వహించలన్నాని సూచించారు. యూనివర్సిటీ ఉన్నతాధికారులను సంప్రదించి ఆ కళాశాలపై తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వైఎస్సార్ జలకళ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి



జలకళ ధృవీకరణ పత్రాలు అందుకున్న వారితో ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

మాచర్ల: రాష్ట్రంలో ప్రతి రైతు కుటుంబం కళకళలాడాలని కోరుకుంటూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మెట్ట రైతుల మేలు కోసం వైఎస్సార్ జలకళ పథకాన్ని ప్రారంభించి ప్రతి రైతుకు బోరు, విద్యుత్ మీటర్‌తో పాటు రైతులకు ఎంతో మేలు జరగాలన్న ఉద్దేశ్యంతోనే సీఎం జగన్ చేపట్టిన జలకళ పథకాన్ని ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శనివారం ఆయన క్యాంపు కార్యాలయంలో కొప్పునూరు గ్రామ పంచాయతీలోని హసనాబాద్ తండా, అలుగురాజుపల్లికి చెందిన 24 మంది రైతులకు జలకళ ధృవీకరణ పత్రాలు అందజేశారు. గిరిజన తండాలలో మేలు జరిగేందుకు ఈ పథకాన్ని చేపట్టారన్నారు. ప్రతి ఒక్కరూ తమ ప్రాంతంలో పరిస్థితులకనుగుణంగా అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ జలకళకు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. రైతుల మేలు కోసం ఎన్ని కోట్లెనా కేటాయించేందుకు సీఎం జగన్ వెనుకాడటం లేదన్నారు. ఎంపీపీ బూడిద శ్రీను, సర్పంచ్ నోముల కృష్ణ యాదవ్, హసనాబాద్ తండా, అలుగురాజుపల్లికి చెందిన రైతులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారితో ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

పలువురు వైఎస్సార్ సీపీలో చేరిక

మాచర్ల: రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద వర్గాల కోసం అనేక సంక్షేమ పథకాలను చేపడుతుండడం ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ వర్గాల కోసం ఆయన చేస్తున్న కృషిని చూసి వైఎస్సార్ సీపీకి మద్దతు పలుకుతూ పలు గ్రామాల్లో వందల సంఖ్యలో పార్టీలో చేరేందుకు ముందుకు రావడం ఎంతో అభినందనీయమని ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. కొప్పునూరు గ్రామ పంచాయతీ పరిధిలో సర్పంచ్ నోముల కృష్ణ ఆధ్వర్యంలో 15 గిరిజన కుటుంబాలు వైఎస్సార్ సీపీకి జేజేలు పలుకుతూ పార్టీలో చేరారు. హసనాబాద్ తండాకు చెందిన కేతావత్ రాకా నాయక్, కేతావత్ బాల, కేతావత్ సరితా నాయక్ కుటుంబాలతో పాటు మరో 10 కుటుంబాల వారు పార్టీలో చేరారు. వీరందరికి ప్రభుత్వ విప్ పీఆర్కే వైఎస్సార్ సీపీ కండువాలు కప్పి స్వాగతం పలికి పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం కల్పిస్తానన్నారు. కార్యక్రమంలో హసనాబాద్ గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

చండియాగ సహిత లక్ష రుద్రాక్ష అభిషేకం

పిడుగురాళ్ల: మండలంలోని గుత్తికొండ బిలంలో స్వస్తిశ్రీ చాంద్రమానే శ్రీ శోభకృత్ నామ సంవత్సర ఆషాడ శుద్ధ సప్తమి ఆదివారం నుంచి గురువారం వరకు చండియాగ సహిత లక్ష రుద్రాక్ష అభిషేక మహోత్సవాన్ని నిర్వహించడం జరుగుతుందని శ్రీశైలం బాలా సిద్ధి పీఠం పరమపూజ్య భవాని స్వామి తెలియజేశారు. పాల్గొని విజయవంతం చేయాలని ఆయన తెలియజేశారు. ఈ నెల 29వ తేదీన మహా పూర్ణాహుతి జరుగుతుందని ఆయన తెలియజేశారు.

సీసీ కెమెరాలు ఏర్పాటుకు సహకరించండి

పిడుగురాళ్ల: పట్టణంలో ప్రధాన కూడళ్లలతోపాటు వ్యాపార సముదాయాల వద్ద కూడా సీసీ కెమెరాల ఏర్పాటుకు వ్యాపార అసోసియేషన్ వారు సహకరించాలని పట్టణ సీఐ పీవీ ఆంజనేయులు సూచించారు. పట్టణంలోని ప్రధాన రహదారిలో ఇప్పుడు ఉన్న కెమెరాలతోపాటు మరింతగా క్వాలిటీతో ఉన్న కెమెరాలను ఏర్పాటు చేస్తే నేరాల సంఖ్యను ఘననీయంగా తగ్గించవచ్చునన్నారు. ఒక సీసీ కెమెరా 24 గంటలు పని చేసే పోలీస్ సిబ్బందితో సమానమన్నారు. అందుకే వ్యాపార సముదాయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తే నేరాలు జరిగే అవకాశం ఉండదు. ఒక వేళ జరిగినా వెంటనే దొంగలను పట్టుకునే అవకాశం ఉంది కాబట్టి వ్యాపార సముదాయాల్లో పలువురు వ్యాపార సముదాయాల అసోసియేషన్‌లు స్వచ్ఛందంగా సీసీ కెమెరాలు పోలీస్ శాఖకు అందించాలని ఈ సందర్భంగా కోరారు. గృహాల వద్ద కూడా ఆర్థిక స్తోమత ఉన్న ప్రతి ఒక్కరు కనీసం రెండు సీసీ కెమెరాలనైనా తమ ఇళ్ల వద్ద ఏర్పాటు చేస్తే ఎటువంటి దొంగతనాలు జరిగే అవకాశం ఉండదని సూచించారు. పట్టణ ప్రజలు ఈ సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకొని సద్వినియోగం చేసుకోవాలన్నారు.